వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఆర్ఎంపీ వినోద్‌కుమార్

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 22 : పేదలు, అనాథలకు తోచిన సాయం అందించడంలోనే ఆత్మ సంతృప్తి కలుగుతుందని ఆర్ఎంపీ వైద్యుడు వినోద్‌కుమార్ అన్నారు. సెమీ క్రిస్మస్ వేడుకల సందర్భంగా ఆదివారం వికారాబాద్ జిల్లా కొత్త గడి గ్రామ సమీపంలో ఉన్న మహిమ మినిస్ట్రీస్ వృద్ధాశ్రమంలో ఆర్ఎంపీ వైద్యుడు వినోద్‌కుమార్ ఆర్థిక సౌజన్యంతో 60 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సెమీ క్రిస్మస్ వేడుకలు జరుపుకొన్నారు. ఆశ్రమ నిర్వాహకుడు ఆర్‌డీ మహారాజ్ ఆర్ఎంపీ వైద్యుడిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాస్టర్లు తిమోతి, హనోక్, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తిరుపతయ్య కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

తుర్కయాంజాల్, డిసెంబర్ 22 : మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ సుందరయ్యనగర్ కాలనీకి చెందిన తిరుపతయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం పలువురు దాతలు తిరుపతయ్య కుటుంబానికి చేయూతను అందించారు. ఇంజాపూర్ శ్రీరంగానురం కాలనీ పద్మశాలి కులస్తులు రూ.16,902, రాగన్నగూడ పద్మశాలి సంఘం సభ్యులు రూ.15వేలు, బీఎన్‌రెడ్డి నగర్ శివమార్కండేయ దేవాలయ కమిటీ సభ్యులు రూ.22,500 తిరుపతయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయాంజాల్, డిసెంబర్ 22 : సాధారణ మరమ్మతుల కారణంగా తుర్కయాంజాల్ మున్సిపాలిటీ సబ్‌స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణపల్లి ఫీడర్ పరిధిలోని శ్రీగణేశ్‌గర్, ఓం గణేశ్‌నగర్, జీవీఆర్ కాలనీ, రెవెన్యూ కాలనీ, రాజీవ్ గృహకల్ప, ఏపీఆర్ హౌసింగ్ ప్రాజెక్ట్, బ్రాహ్మణపల్లి ఎక్స్‌రోడ్డులో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తుర్కయాంజాల్ విద్యుత్ శాఖ ఏఈ తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

విరాళం అందజేస్తున్న మాజీ వార్డు సభ్యురాలు యాదమ్మ

చేవెళ్లటౌన్, డిసెంబర్ 22: చేవెళ్ల పట్టణ కేంద్రంలో నిర్మిస్తున్న మల్లికార్జున స్వామి దేవాలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేస్తున్నారు. చేవెళ్లలోని పురాతన దేవాలయం మల్లికార్జున ఆలయ నిర్మాణం కోసం చేవెళ్ల గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యురాలు కావడి యాదమ్మ నరసింహారెడ్డి గార్ల మనుమడు రియాన్స్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా లక్ష రూపాయలను ఆదివారం దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. వారి వెంట దాతలు కావడి బుచ్చిరెడ్డి, కావడి రాజవర్ధన్‌రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

విద్యార్థులకు స్వెటర్లు అందజేస్తున్న వార్డెన్ శంకర్

షాబాద్, డిసెంబర్ 22: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదుగాలని షాబాద్ ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్ శంకర్ అన్నారు. ఆదివారం షాబాద్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన స్వెటర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్టల్ ఇన్‌చార్జి నర్సింహులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీ జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

మాజీ మంత్రి పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డికి వినతి

ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

మొయినాబాద్, డిసెంబర్ 22 : రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి కృషి చేయాలని అన్ని పార్టీల ప్రజాప్రతినిధులను కలువడం జరిగిందని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు సామ మాధవరెడ్డి అన్నారు. ఆదివారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డికి జిల్లెల్‌గూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు పూర్తి స్థాయిలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు రైతులకు రుణమాఫీ చేయలేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేస్తుందని భావించి రైతులు కాంగ్రెస్‌కు ఓటు వేశారని తెలిపారు. వ్యవసాయం కోసం రైతులు వినియోగిస్తున్న ట్రాక్టర్ల లైఫ్ టైమ్ పెంచే విధంగా అవకాశం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు సన్న వడ్లపై రూ.500 బోనస్‌ను ఇవ్వాలని అన్నారు. ట్రాక్టర్ ట్రాలీ రిజిస్ట్రేషన్ ఫెనాల్టీ తగ్గించాలని చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా విష్ణువర్ధన్‌రెడ్డి, కార్యదర్శి నోముల గోవర్ధన్‌రెడ్డి, మహిళా ప్రముఖ్ రామేశ్వరిదేవి, మహేశ్వరం మండలం అధ్యక్షుడు వెంకట్‌రమణారెడ్డి, కార్యదర్శి యాదయ్యగౌడ్, జిల్లా కార్యవర్గసభ్యులు హరి కృష్ణారెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, సి.రాఘవరెడ్డి, జి.విజయేంద్రెడ్డి, ఎన్.కృపాకర్‌రెడ్డి, జి.రాజవర్ధన్‌రెడ్డి, జిల్లెల్‌గూడ కార్పొరేటర్ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు విడనాడాలి

ఆమనగల్లు, డిసెంబర్ 22: కేంద్రంలోని బీజేపీ అమలు చేస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను విడనాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని మాస్టర్ డిగ్రీ కళాశాలలో సీపీఎం ఆమనగల్లు ఏరియా మహాసభలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి భాస్కర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆమనగల్లు ఏరియా కన్వీనర్ వెంకటయ్య సీపీఎం ఎర్రజెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కార్యదర్శి భాస్కర్ స్థానిక నాయకులతో కలిసి కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందాయన్నారు. విద్య, వైద్యం కుంటుపడుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజూనాయక్, నాయకులు శివశంకర్, పెంటయ్య, కుర్మయ్య, చెన్నయ్య, నర్సింహ, హంసమ్మ, రమేశ్, పోచయ్య పాల్గొన్నారు.

సీపీఎం ఆమనగల్లు ఏరియా కన్వీనర్‌గా శివశంకర్

ఆమనగల్లు : పట్టణంలో నిర్వహించిన ఆమనగల్లు ఏరియా సీపీఎం మహాసభల సందర్భంగా సీపీఎం ఆమనగల్లు ఏరియా కమిటీని జిల్లా కార్యదర్శి భాస్కర్ సమక్షంలో ఎన్నుకున్నారు. ఏరియా కన్వీనర్‌గా శివశంకర్, సభ్యులుగా పెంటయ్య, కుర్మయ్య, చెన్నయ్య, నర్సింహ, హంసమ్మ, రమేశ్, పోచయ్య ఎన్నికయ్యారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్

శ్రీనివాస రామానుజన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంఈవో, గణిత ఫోరం నాయకులు

గణితంపై ఆసక్తి పెంచుకోవాలి

షాద్‌నగర్‌టౌన్, డిసెంబర్ 22: గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ అని ఎంఈవో మనోహర్ అన్నారు. శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా షాద్‌నగర్ గణిత ఫోరం ఆధ్వర్యంలో పట్టణంలోని ఎమార్సీ కార్యాలయ ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు శ్రీనివాసరామానుజన్ స్ఫూర్తితో గణితంపై పట్టుసాధించాలన్నారు. చిన్నతనం నుంచే గణితంపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో గణిత ఫోరం అధ్యక్షుడు నర్సింహులు, జీహెచ్ఎంలు పాండు రంగయ్య, గణేశ్‌కుమార్, మల్లేశ్, బాబు చంద్, గణిత ఉపాధ్యాయులు ప్రకాశ్, సురేందర్‌రెడ్డి, నర్సింహులు, శైలజ పాల్గొన్నారు.

రాళ్లు అమర్చి.. కట్టెలు పేర్చి

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 22: చిన్న సమస్యలు ఒక్కోసారి ప్రాణాల మీదకు తేవొచ్చు. మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం – మర్రిపల్లి ప్రధాన రహదారిపై నిత్యం వేల వాహనాలు వెళ్తుంటాయి. రాత్రిళ్లు ఎదురుగా భారీ వాహనాలు వస్తే చిన్న వాహనాలు రోడ్డు పక్కకు వెళ్లే పరిస్థితులు వస్తాయి. అయితే, తట్టిఅన్నారం గ్రామంలోని అయ్యప్ప కాలనీ వద్ద ప్రధాన రహదారిపై మ్యాన్‌హోల్ తెరుచుకుని ప్రమాదకరంగా మారింది. మ్యాన్‌హోల్‌పై మూత లేకపోవడంతో రాళ్లు పెట్టి, అందులో కట్టెలు పేర్చారు. ఉదయం వేళ అవి కనిపిస్తున్నా.. రాత్రిళ్లు దగ్గరకు వచ్చే వరకు కనిపించని పరిస్థితి నెలకొన్నది. ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకముందే మున్సిపల్ అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

నినాదాలు చేస్తున్న సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు

మన్సూరాబాద్, డిసెంబర్ 22: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను తక్షణమే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు డిమాండ్ చేశారు. ఆదివారం సోషల్ జస్టిస్ పార్టీ ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చామకూర రాజు మాట్లాడుతూ హోం మంత్రి పదవిలో కొనసాగుతున్న అమిత్‌షా అహంకార ధోరణితో అంబేద్కర్‌ను అవమానపరిచారన్నారు. హోం మంత్రి పదవి నుంచి అమిత్‌షాను బర్తరఫ్ చేయకపోతే దేశవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలు పోరాటం చేసి కేంద్ర ప్రభుత్వ మెడలను వంచుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సోషల్ జస్టిస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి కేవీ గౌడ్, జాతీయ అధికార ప్రతినిధి వేముల కొండల్ గౌడ్, సంయుక్త కార్యదర్శి బాలస్వామి, తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

కందుకూరు, డిసెంబర్ 22 : ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ జడ్పీటీసీ జంగారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ సరికొండ పాండు తెలిపారు. కందుకూరు గ్రామంలో కొండేటి సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ శిబిరంలో డాక్టర్లు పరీక్షలు నిర్వహించిన అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాజీ సర్పంచ్ మన్నే జయేందర్ ముదిరాజ్,సురుసాని జైపాల్‌డ్డి, మేనేజింగ్ డైరెక్టరు కొంబేటి మల్లయ్య, డాక్టరు ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

కుల మతాలకతీతంగా కలిసిమెలిసి ఉండాలి

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



షాబాద్ పహిల్వాన్‌షావలి దర్గాలో జరిగిన ఉర్సులో పాల్గొన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

షాబాద్, డిసెంబర్ 22: కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి ఉండాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం షాబాద్ మండల కేంద్రంలోని పహిల్వాన్‌షావలి దర్గాలో ఉర్సులో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. ఆయన వెంట మైనార్టీసెల్ నాయకులు మతిన్, ఆరీఫ్, తౌఫిక్, ఆయూబ్, ఇమ్రాన్, మునీర్, మాజీద్, మాజీ జడ్పీటీసీ రాజేందర్‌గౌడ్, రమేశ్‌యాదవ్, మంగలి సత్యం, అంజయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

కార్యక్రమంలో జీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్

షాద్‌నగర్‌టౌన్, డిసెంబర్ 22: ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, మద్దూరి ఫౌండేషన్ చైర్మన్ మద్దూరి అశోక్‌గౌడ్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని గ్రీన్‌పార్క్ ఫంక్షన్‌హాల్‌లో సౌత్ ఇండియా కరాటే కుంపూ, కరాటే చాంపియన్‌షిప్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రతన్ టాటా మెమోరియల్ కరాటే టోర్నమెంట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కరాటే ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చిన్నారులు కరాటే విద్యను నేర్చుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. దేశం గర్వించదగ్గ మహనీయుడు రతన్ టాటా అని, ఆయన పేరుమీద మెమోరియల్ కరాటే టోర్నమెంట్ నిర్వహించడం సంతోషకరమన్నారు. అనంతరం టోర్నమెంట్‌లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఎన్జీవోస్ కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, డిసెంబర్ 22 : ఎన్జీవోస్ కాలనీలో రూ.78లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కాలనీలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేస్తామన్నారు. ప్రజలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ప్రజా ధనం వృథా కాకుండా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్‌రావు, కాలనీ వాసులు పంపన వెంకటేశ్వర్లు, సోమయాజులు, శ్యామ్‌కుమార ఆనంద్, వర్ధిని, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికే అధిక ప్రాధాన్యం

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

మలక్‌పేట, డిసెంబర్ 22: సైదాబాద్ డివిజన్‌లో ఎక్కువ కాలం మన్నిక వచ్చే సీసీ రోడ్ల నిర్మాణానికే అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి అన్నారు. సైదాబాద్ ఎస్‌బీహెచ్–సీ కాలనీలో రామ్స్ రెసిడెన్స్ నుంచి మూన్‌స్టార్ పాఠశాలకు వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్లను ఒక్కసారి నిర్మిస్తే 30 ఏండ్ల వరకు పాడవవని అన్నారు. బీటీ రోడ్లకు కొంచెం తేమ తగిలినా, రోడ్డుపై నీరు నిలిచినా తొందరగా పాడవుతాయని తెలిపారు. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీల్లో సీసీ రోడ్లను నిర్మించటం జరిగిందని, దశలవారీగా అన్ని కాలనీల్లో నిర్మిస్తామని ఆమె తెలిపారు. రహదారుల నిర్మాణాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఈ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, కాలనీ సంక్షేమ సంఘ కార్యదర్శి చారి, సభ్యులు రవీందర్, నీరజ, సుస్మిత, మమత, రాజారాం, సుభాశ్ పాల్గొన్నారు.

చెత్త సేకరణ డబ్బాలు పంపిణీ

వైదేహినగర్ నార్త్ కాలనీలో చెత్త డబ్బాలను అందజేస్తున్న అరవింద్‌రెడ్డి

వనస్థలిపురం, డిసెంబర్ 22 : చెత్త నిర్వహణలో ప్రతి ఒక్కరూ సహకరించాలని బీఆర్ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి అన్నారు. వైదేహినగర్ నార్త్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీవాసులకు ఆదివారం చెత్త సేకరణ డబ్బాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ప్రతి ఇంటికీ రెండు డబ్బాల చొప్పున అందజేసిందన్నారు. వాటి స్థానంలో వైదేహినగర్ నార్త్ కాలనీ సంక్షేమ సంఘం సొంత ఖర్చులతో డబ్బాలను అందజేయడం అభినందనీయమన్నారు. ప్రతి కాలనీలోనూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వచేసి ఆటో రిక్షాల్లో వేయాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామన్నారు. కాలనీ అధ్యక్షుడు రాంబాబును ఆయన అభినందించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

మాదాపూర్ శిల్పారామంలో కొనసాగుతున్న ఆల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళాలో ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం టెక్సాస్ నుంచి విచ్చేసిన భరతనాట్య కళాకారులు పూజ, దిశా నియతి నృత్యరూపకంలో నర్తించారు. హైదరాబాద్ మహారాష్ట్రీయన్ అసోసియేషన్ అంబరీశ్ లాహంకార ఆధ్వర్యంలో డోల్ తాషా (డ్రమ్స్) వాయించారు. సౌత్ సెంట్రల్ కల్చరల్ సెంటర్ తంజావూర్ నుంచి విచ్చేసిన కళాకారుల గారడీ గొంబే జానపద నృత్యం అలరించింది.

- కొండాపూర్

మీనాక్షి టవర్‌లో అగ్నిప్రమాదం

సెల్లార్ నుంచి 18వ అంతస్తు వరకు దగ్ధమైన కేబుల్స్

కొండాపూర్/మాదాపూర్ , డిసెంబర్ 22 : ఓ గేటెడ్ కమ్యూనిటీలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో సెల్లార్ నుంచి 18వ అంతస్తు వరకు ఉన్న విద్యుత్, ఇతర కేబుల్ వైర్లు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఈ సంఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మాదాపూర్ ఖానామెట్‌లోని మీనాక్షి టవర్స్ పేరిట ఉన్న గేటెడ్ కమ్యూనిటీలోని బీ బ్లాక్ సెల్లార్–2తో కలిపి 18 అంతస్తులతో భవనం ఉంది. ఆదివారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా 18 అంతస్తుల వరకు ఉన్న విద్యుత్, ఇతర కేబుల్స్ పూర్తిగా కాలిపోయి దట్టమైన పొగలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న మాదాపూర్ ఫైర్ అధికారులు, సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, ప్రమాద తీవ్రతను రాష్ట్ర అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి పరిశీలించారు. ఈ మేరకు మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మీనాక్షి టవర్స్ వద్ద ప్రమాదాన్ని పరిశీలిస్తున్న డీజీ నాగిరెడ్డి

గణితం పోటీ పరీక్షలో ప్రభుత్వ విద్యార్థి సత్తా

రెండో బహుమతి అందుకుంటున్న విద్యార్థి కార్తీక్

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 22: విద్యార్థులు గణితాన్ని అర్థం చేసుకుంటే సులభంగా రాణించగలరని గణేశ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఉపాధ్యాయుడు మాణిక్యంరెడ్డిలు అన్నారు. తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో హయాత్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి గణిత ప్రతిభా పరీక్ష–2024ను ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో గణేశ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి పి.కార్తీక్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రంలోనే రెండవ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా నిర్వాహకులు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం కార్తీక్‌ను అభినందించి రానున్న రోజుల్లో మరిన్ని పోటీల్లో పరీక్షల్లో రాణించాలని సూచించారు.